సాక్షి గుంటూరు

గురువారం ▪ 21 ▪ నవంబర్ ▪ 2024



గ్యాస్ ఆటోలో మంటలు

తాడేపల్లి రూరల్: చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిలో కొలనుకొండ వద్ద బుధవారం వెళ్తున్న ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడు ఆటో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో 43.25 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో, దిగువకు నిలుపుదల చేశారు.

నరేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు



భట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రులో గల బాలాత్రిపురసుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ప్రాతఃకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీశృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి ఆశీర్వచనం



పెదకాకాని: శ్రీశృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి వీవీఐటీ కళాశాలను సందర్శించారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు తొలుత ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. విజయ యాత్ర మహోత్సవంలో భాగంగా గుంటూరు పర్యటనకు విచ్చేసిన స్వామీజీ మంగళవారం రాత్రి వీవీఐటీ ఆహ్వానం మేరకు కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. విద్యార్థులంటే దేశ బంగారు భవిష్యత్ అన్నారు. ఆధునిక విద్య అందించడం ద్వారా దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని పేర్కొన్నారు. మంచి లక్ష్యం ఎంచుకుని సాధించేలా కృషి చేయాలని సూచించారు. దేశం, ధర్మం రెండు కళ్ల వంటివి అన్నారు. వాటిని మనం పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ బదరీ ప్రసాద్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియానికి 15 వరకు గడువు

కొరిటెపాడు(గుంటూరు): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా రైతుల నమోదు ప్రక్రియ రబీ 2024–25 పంటల కోసం ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర, పప్పు శనగ పంటలు సాగు చేసే రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. మొక్కజొన్న ఎకరాకు ప్రీమియం రూ.114, జొన్నకు రూ.48, మినుముకు రూ.50, పెసరకు రూ.45, పప్పు శనగ ఎకరాకు రూ.70 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. బ్యాంక్‌ల నుంచి రుణం పొందిన రైతులు తమ బ్యాంకుల ద్వారా ఆటోమేటిక్‌గా నమోదై ఉంటారని, రుణం పొందని రైతులు సమీప కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి ప్రీమియం చెల్లించి నమోదు చేయించుకోవాలని కోరారు. నమోదు కోసం ఆధార్ కార్డు, సీసీఆర్సీ లేదా లీజు ఒప్పంద పత్రం, పంట, సాగు విస్తీర్ణ సర్టిఫికెట్, బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించాలని సూచించారు. ప్రీమియం చెల్లించిన రైతులు విధిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

16న విజ్ఞాన్‌లో వర్క్‌షాప్



చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో డిసెంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు ఇంటర్నేషనల్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. ఇన్నోవేషన్స్ ఈ–మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ అండ్ మోడలింగ్ అనే అంశంపై హైబ్రిడ్ మోడ్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: తాడికొండ మండలం పొన్నెకల్లులోని డీవీకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు వై. రాజారెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత నెల 24న పాఠశాలకు గైర్హాజరైన 9వ తరగతి విద్యార్థి షేక్ సమీర్ ప్రమాదవశాత్తూ బావిలో పడి మరణించిన ఘటన విదితమే. పాఠశాల చివరి పీరియడ్‌లో గోడ దూకి బయటకు వెళ్లిన తొమ్మిది మంది విద్యార్థులు సమీర్‌తో కలిసి ఈతకు వెళ్లిన సంఘటనలో ప్రధానోపాధ్యాయురాలితోపాటు వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు నిర్లక్ష్య వైఖరే కారణమని ఉప విద్యాశాఖాధికారి నివేదిక సమర్పించారు. దాని ఆధారంగా పీడీని డీఈవో రేణుక సస్పెండ్ చేశారు. హెచ్‌ఎం జరీనా ముంతాజ్ బేగంపై చర్యల నిమిత్తం ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డికి నివేదిక సమర్పించారు.

బెయిల్ పిటిషన్లు డిస్మిస్

నగరంపాలెం: బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్లను బుధవారం జడ్జి డిస్మిస్ చేశారు. గుంటూరు అరండల్‌పేట పీఎస్‌లో అతనిపై రెండు కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆ రెండు కేసుల్లో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను గుంటూరు ఐదో జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి లత డిస్మిస్ చేశారు.

అన్నీ పత్తిత్తు మాటలే!

- నిబంధనల పేరిట చుక్కలు చూపుతున్న సీసీఐ
- తేమ శాతంపై పత్తి రైతులకు తప్పని అవస్థలు
- గిట్టుబాటు ధరపై ఇష్టారాజ్యంగా అధికారుల తీరు
- మిల్లుల యజమానులతో కుమ్మక్కు ఆరోపణలు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలులో నిర్లక్ష్య వైఖరి చాటుతోంది. ఈ కారణంగా పత్తి రైతులు చిత్తవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు ఆమడ దూరంలోనే ఉండిపోతున్నారు. నిబంధనల పేరుతో కొనుగోలు చేయడానికి విముఖత చూపిస్తుండటంతో రైతులు దళారులకు వారు ఇచ్చిన ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది.



పత్తిని టిక్కీలలోకి మారుస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో 54,640 ఎకరాల్లో పత్తి పంట వేశారు. ఇది సాధారణ విస్తీర్ణం కన్నా తక్కువే. అయినా రైతులకు గిట్టుబాటు ధర మాత్రం దక్కడం లేదు. జిల్లాలో మొత్తం 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ఇవి ఉన్నాయి.

నిబంధనల పేరు చెప్పి...

పత్తి క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521గా ప్రకటించారు. సీసీఐ దానికి కొన్ని షరతులు జోడించింది. తేమ 12 శాతంలోపు, పింజ పొడవు 29.5 – 30.5 మి.మీ., మైక్రోనీర్ విలువ 3.6 – 4.3 మధ్య ఉంటేనే మద్దతు ధర ఇస్తామని ప్రకటించింది. తేమ శాతం, పింజ పొడవు ఏ మాత్రం అటు ఇటు అయినా ధరలో కోత వేసేస్తున్నారు. అన్ని బాగున్నా ఏదో ఒక సాకు పెట్టి రూ.7 వేలకు మించి ఇవ్వడం లేదు. ఇక తేమ 12 శాతం దాటితే కొనకుండా ఇబ్బంది పెడుతున్నారు. మిల్లుకు తీసుకెళ్లినా విక్రయించలేని పరిస్థితిలో దళారులు, ప్రయివేటు వ్యాపారులు రంగం ప్రవేశం చేస్తున్నారు. వారు అడిగిన ధరకు రైతులు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ. 5 వేల – రూ. 6 వేలలోపే చెల్లిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి నాణ్యమైన దిగుబడి వచ్చినా అందుబాటులో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోంది. పత్తి నిల్వ చేసుకుంటే రంగు మారి ధరలు మరింత తక్కువ ధర వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. నవంబర్ నెల చివర కావడంతో మంచు కురుస్తోంది. దీనివల్ల పత్తిలో తేమశాతం పెరగడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

మరిన్ని ఆటంకాలు

రైతులు తమ పంటను ఈ – క్రాప్ బుకింగ్, ఈ – పంట నమోదు ప్రక్రియ చేయడంతోపాటు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం అందజేయాలి. అమ్మకాల కోసం రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా రావాల్సి ఉంటుందని నిబంధన పెట్టారు. ఇవన్నీ రైతులకు ఇబ్బందికరంగా మారాయి. కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డులో కాకుండా మారుమూల ఉన్న మిల్లుల వద్ద ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వ్యవసాయ పనులు మానుకొని పంట విక్రయించేందుకు రైతులు రెండు రోజులు వెచ్చించాల్సి వస్తోంది. నిబంధనల పేరుతో మద్దతు ధర ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చాలామంది గ్రామాల్లోనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు బయ్యర్లు వచ్చి కొనుగోలు చేసేవారు. ఒకరోజు పంటను కొనుగోలు చేయలేక పోయినా మరునాడు వెసులుబాటు ఉండేది. ఇప్పుడు వేరే ప్రాంతానికి వెళ్లి పత్తి విక్రయించడం ఇబ్బందికరంగా మారింది. అక్కడ వసతులు లేక రాత్రిళ్లు బస చేయాలన్నా, పంటకు కాపలా కాయాలన్నా రైతులకు కుదిరే పని కాదు. గతంలో సీసీఐ కొనుగోళ్లకు వచ్చే రైతులకు మార్కెట్ యార్డులో తాగునీరు, రెస్ట్ తీసుకునేందుకు బస వసతి ఏర్పాటు చేసేది. పత్తి మిల్లుల్లో ఆ పరిస్థితి లేదు. కనీసం పట్టించుకునే నాథుడు లేడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమానులు కుమ్మక్కు కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

తాడికొండ మండలంలోని పత్తి రైతులకు ప్రత్తిపాడు మండలంలోని కోయపాలెంలోని జిన్నింగ్ మిల్లును కొనుగోలు కేంద్రంగా నిర్ణయించారు. ఇక్కడికి తీసుకువెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉంది. క్వింటాలుకు రూ. 400 – రూ. 500 అద్దె చెల్లించాల్సి వస్తోంది.



ధర లేక చేనులోనే నిల్వ చేసిన పత్తి

మార్కెట్ యార్డులో కొనాలి



ఈ ఏడాది పది ఎకరాల్లో పత్తి సాగు చేశా. పెరిగిన కౌలు, వ్యవసాయ కూలీల ఖర్చులు కలిపి ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.80 వేలు ఖర్చు చేశాం. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయకపోతే ఈ ఏడాది కష్టాలు వచ్చే అవకాశం ఉంది. నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టకుండా మద్దతు ధరకు మార్కెట్ యార్డులలో సీసీఐ కొనుగోలు చేయాలి.

– బిక్కి శివరామకృష్ణ, రైతు, పాములపాడు

నేరుగా కొనుగోలు చేయాలి



పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు రైతులను ఇరకాటంలో పెడుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.5,500 మించి పత్తి ఎవరూ తీసుకోవడం లేదు. నాణ్యమైన పత్తి విక్రయించుకోవాలంటే సవాలక్ష ఆంక్షలు విధించడం మంచిది కాదు. మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లేదంటే ఈ ఏడాది భారీ నష్టాలు తప్పవు.

– చింతల భాస్కరరావు సీపీఐ మండల కార్యదర్శి

నేటి నుంచి జీజీహెచ్‌లో వాహనాలకు గేట్ పాస్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఇతరుల వాహనాల రద్దీని తగ్గించేందుకు గురువారం నుంచి గేట్‌పాస్ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నారు. సూపరింటెండెంట్‌గా డాక్టర్ యశస్వి రమణ బాధ్యతలు స్వీకరించిన వెంటనే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించారు. తొలుత సిబ్బంది వాహనాలు మాత్రమే అనుమతించేలా మార్గదర్శకాలు జారీ చేశారు. గేట్ పాస్‌లు లేకపోవడంతో ఇతరులు కూడా లోనికి తీసుకొస్తున్నారు. సిబ్బందితో గొడవ పడుతున్నారు. దీంతో సిబ్బందికి ప్రత్యేకంగా రూపొందించిన వాహనాల స్టిక్కర్లను గేట్ పాస్ మాదిరిగా అందిస్తున్నారు. సుమారు 2 వేల వాహనాల గేట్‌పాస్‌లను ఆసుపత్రి అధికారులు సిద్ధం చేశారు. వైద్యులకు, నర్సులకు, నాలుగో తరగతి ఉద్యోగులకు, పారా మెడికల్ సిబ్బందికి, శానిటేషన్ వారికి, సెక్యూరిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేర్వేరు రంగుల్లో రూపొందించిన గేట్‌పాస్‌ను సిద్ధమయ్యాయి. గేట్‌పాస్‌లపై ఆసుపత్రి సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్‌ల సంతకాలు ఉన్నాయి. సిబ్బంది వివరాలు సైతం దానిపై ముద్రించనున్నారు. ఖాళీ ఆటోలు, రోగుల సహాయకుల వాహనాలు ఉదయం ఆసుపత్రి ఓపీ ప్రారంభ సమయంలో అధిక సంఖ్యలో వస్తున్నాయి. ఆసుపత్రి ఆవరణం వాహనాలతో నిండిపోతోంది. ట్రాఫిక్ సమస్య బాగా పెరిగింది. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బయోమెట్రిక్ హాజరు వేసేందుకు వైద్యులు, సిబ్బంది వాహనాలు పార్కింగ్ చేయాలన్నా అవస్థలు తప్పడం లేదు. క్యాజువాల్టీ ఎదుట సైతం అంబులెన్సులు నిలిపేందుకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. వీటన్నింటికీ పరిష్కారం గేట్‌పాస్ అని డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. విడతల వారీగా అందరికీ గేట్‌పాస్‌లు అందిస్తామని చెప్పారు.

పెదకొండూరులో ఉచిత ఇసుకకు తూట్లు

- నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో తవ్వకాలు
- వందల సంఖ్యలో వరుస కట్టిన ట్రాక్టర్లు
- ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు
- యజమానిని బతిమిలాడి జేసీబీ సీజ్!



జేసీబీతో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులో కృష్ణానదిలో ఉచిత ఇసుకకు తూట్లు పొడుస్తూ కొంతమంది బుధవారం ఏకంగా జేసీబీల సహాయంతో ట్రాక్టర్లకు లోడింగ్ ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమానులు వందల మంది పెదకొండూరు ఇసుక రీచ్ వద్ద క్యూ కట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వచ్చి జేసీబీని సీజ్ చేసి, పోలీసులకు అప్పగించారు. అక్కడ ఉన్న ట్రాక్టర్లను గానీ, వాటి యజమానులను గానీ అదుపులోకి తీసుకోలేదు. దీంతో అధికారులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెల్లవారుజాము నుంచి ఈ తవ్వకాలు జరిగాయి. అప్పుడు అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై జేసీబీ యజమాని దౌర్జన్యం చేశాడు. చివరకు అధికారులు బతిమిలాడి జేసీబీపై కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 43 ప్రకారం ఇసుక తవ్వకాలు నిర్వహించుకోవచ్చని, కృష్ణానది తీరంలో ఎవరికైనా ఇసుక అవసరమైతే వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసి రసీదు పొందవచ్చని చెప్పారు. లేదంటే వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లోని సచివాలయాల్లోని డీఏను కలిసి నిర్మాణ సంబంధిత వివరాలు నమోదు చేసి రసీదు పొందవచ్చని తెలిపారు. రసీదు లేకున్నా, అక్రమంగా రవాణా చేసినా చట్ట ప్రకారం పోలీసు కేసు నమోదు చేస్తామని చెప్పారు. ట్రాక్టర్‌కు రూ.10 వేలు, లారీకి రూ.25 వేలు, జేసీబీకి రూ.50 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సనాతన వైదిక ధర్మం ఎంతో గొప్పది



శంకర మఠంలో భక్తులకు ఆశీస్సులందిస్తున్న శ్రీశ్రీవిదుశేఖర భారతీ స్వామి

- శ్రీశ్రీ విదుశేఖర భారతీ స్వామి అనుగ్రహ భాషణం
- పట్టణంలో సాగిన విజయ యాత్ర
- వేదభారతీ వసతి గృహాన్ని ప్రారంభించిన స్వామి



శారదాంబ అమ్మవారి సన్నిధిలో విదుశేఖర స్వామి

నరసరావుపేట ఈస్ట్: దేశంలో అనాదిగా కొనసాగుతున్న హిందూ ధర్మాన్ని సనాతన వైదిక ధర్మంగా గుర్తించాలని శృంగేరీ శ్రీశారదా పీఠం ఉత్తరాధికారి శ్రీవిదుశేఖర భారతీ స్వామి తెలిపారు. శ్రీవిదుశేఖర స్వామి విజయ యాత్రలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని శ్రీశృంగేరీ శంకర మఠానికి చేరుకున్నారు. వేద పండితుల స్వాగత వచనాల మధ్య శంకర మఠానికి విచ్చేసిన స్వామి మఠం ఆవరణలోని శారదాంబ అమ్మవారిని దర్శించుకొని హారతి సమర్పించారు. అలాగే శ్రీశంకర చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు పాదుకా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విదుశేఖర స్వామి అనుగ్రహ భాషణ చేశారు. ప్రస్తుతం మనం పిలుచుకుంటున్న హిందూ ధర్మానికి మరో పేరు సనాతన వైదిక ధర్మమని అభివర్ణించారు. ఇది మన ధర్మం గొప్పతనాన్ని సూచిస్తున్నదని వివరించారు. ప్రపంచం దేని ద్వారా ధరింపబడుతుందో దానిని ధర్మం అంటారని తెలిపారు. ధర్మం, అధర్మం ఈ రెండూ నేడు మనిషిని నడిపిస్తున్నాయని, ఆశాజీవిగా మనిషి అన్నీ తనకు అనుకూలంగా కావాలనుకుంటూ స్వార్థంతో వ్యవహరిస్తాడని తెలిపారు. అయితే ధర్మం ఏదివ్వాలో దానినే అందిస్తుందని తెలిపారు. అనుగ్రహ భాషణ అనంతరం స్వామి రామిరెడ్డిపేటలో కొత్తగా నిర్మించిన వేద విద్యార్థుల వసతి గృహం వేదభారతీ గృహాన్ని ప్రారంభించారు. వేదభారతి వద్దకు చేరుకున్న స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి అక్కడే బస చేశారు. ఈ కార్యక్రమాలలో నరసరావుపేట జమిందార్ కొండలరావు బహదూర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త పాల్గొన్నారు,

నేటి స్వామి పర్యటన ఇలా..

విదుశేఖర భారతీ స్వామి గురువారం ఉదయం పాతూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. శ్రీభీమలింగేశ్వరస్వామి నగరోత్సవానికి సిద్ధం చేసిన నూతన దివ్య రథాన్ని ప్రారంభించి పాత శంకర మఠంను సందర్శిస్తారు. అక్కడి నుంచి కోటప్పకొండ చేరుకొని శ్రీత్రికోటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తారు. కోటప్పకొండ నుంచి మిన్నెకల్లు గ్రామానికి చేరుకొని అక్కడ శ్రీశ్రీభారతీ తీర్థ స్వామి పూర్వాశ్రమ మాతృమూర్తి పేరుతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తారు. తిరిగి శంకర మఠం చేరుకొని భక్తుల పూజలు స్వీకరించి సాయంత్రం 4 గంటల సమయంలో తన విజయ యాత్రను కొనసాగిస్తారు.

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత నెరవేర్చాలి



జేకేసీ కళాశాలలో ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యావంతులుగా ఎదిగిన తరువాత ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతలను నెరవేర్చాలని డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో ఆధునికీకరించిన ఆడిటోరియాన్ని బుధవారం కళాశాల పూర్వ విద్యార్థి, డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ సమావేశంలో ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థిగా ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన జేకేసీ కళాశాలలో పని చేసిన అధ్యాపకులు ఇక్కడి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని అన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 1980లో జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి కుమార్తె యార్లగడ్డ ఉమాదేవి ఆ రోజుల్లోనే రూ.రెండు లక్షలు వితరణ చేసిన కారణంగా ఆడిటోరియానికి ఆయన పేరు పెట్టామని చెప్పారు. ప్రస్తుతం 460 మంది కూర్చునే విధంగా అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో ఆడిటోరియం సిద్ధం చేసినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు తమవంతు సహాయ, సహకారాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఏపీ సాంకేతిక సేవల సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కాకినాడ సీపోర్ట్ చైర్మన్ కేవీ రావు, యార్లగడ్డ ఉమాదేవి, కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్‌ఆర్‌కే ప్రసాద్, పూర్వ విద్యార్థులు చుక్కపల్లి రమేష్, పి. నాగసుశీల పాల్గొన్నారు.

అమరావతిలో వేదనాదం

అమరావతి: ప్రథమ పంచారామక్షేత్రం అమరావతిలో ఘంటశాల చంద్రమౌళీశర్మ ఆధ్వర్యంలో బుధవారం వేదపాఠశాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం అమరేశ్వరస్వామి గాలిగోపురం నుంచి వేదపాఠశాల వరకు వేద విద్యార్థులు శోభాయాత్ర నిర్వహించారు. తొలుత బ్రహ్మశ్రీ సత్యనారాయణ అవధాని యజ్ఞశ్రీ పర్యవేక్షణలో గణపతి హోమం, గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మండపారాధనలు, వేదపారాయణలు, దుర్గాసప్తశతి పారాయణం, సూర్య నమస్కారాలు, లక్ష్మీగణపతి హోమ సహిత అవహంతిహవనం, రుద్ర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహూతి కార్యక్రమాలతో ప్రారంభోత్సవాలు పూర్తిచేశారు. ఈసందర్భంగా ఘంటశాల చంద్రమౌళీశర్మ మాట్లాడుతూ అమరావతి వేదపాఠశాలలో వంద మందికిపైగా పేద బ్రాహ్మణ విద్యార్థులకు బోజన, వసతి సౌకర్యాలతో ఉచిత వేద విద్య బోధన, స్మార్త ఆగమ విద్యను అందిస్తామని పేర్కొన్నారు.



విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా వెంకట్రావు



బాపట్ల టౌన్: విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా డి. వెంకటరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పనిచేస్తున్న ఆయన బదిలీపై బాపట్ల వచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు శిక్షణలు ఇచ్చే ప్రాంతీయ శిక్షణ కేంద్రంగా బాపట్ల ఉంటుందని ఆయన తెలిపారు. పంచాయతీ రాజ్ సంస్థల బలోపేతం చేసే దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉన్నతాధికారుల సమన్వయంతో శిక్షణ కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

దాచేపల్లిలో ఉద్రిక్తత

- టిప్పు సుల్తాన్ ర్యాలీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చెదరగొట్టిన పోలీసులు

దాచేపల్లి : పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీలో బుధవారం జరిగిన టిప్పు సుల్తాన్ ర్యాలీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు జెండాలు పట్టుకుని టిప్పు సుల్తాన్ ర్యాలీ చేశారు. కారంపూడి రోడ్డు సెంటర్‌కు ర్యాలీ వస్తున్న క్రమంలో మరో సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఛత్రపతి శివాజీ ఫొటోలు చూపిస్తూ కేకలు వేశారు. దీంతో ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగారు. అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఒక వర్గం మరోవర్గంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతుండటంతో పోలీసులు అందరినీ అక్కడి నుంచి పంపించారు.